# హామీలు నెరవేరుస్తామనడం ఓ పెద్ద డ్రామా...

- ఢిల్లీలో రాజీనామా చేస్తే..తెలంగాణలో హామీలు అమలు చేస్తారా..
- విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రాజీనామా చేయాలి..
- కాంగ్రెస్ వైఫల్యాలపై కొప్పుల మహేష్ రెడ్డి ధ్వజం..



**పరిగి, జూలై 26 ( తెలంగాణ డైలి న్యూస్ ):** కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయడాన్ని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి స్వాగతించారు. ఇది నిజంగా శుభపరిణామం. యువత, జెన్-జెడ్ తిరుగుబాటు దెబ్బకు కేంద్ర ప్రభుత్వానికి దిమ్మతిరిగి దెయ్యం వదిలింది. ఇదే తరహా పరిణామాలు తెలంగాణలోనూ పునరావృతమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయి అని మహేష్ రెడ్డి హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా తీరుపై మహేష్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా సాగుతున్న యువత పోరాటాలు, రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ ఆయన కాంగ్రెస్ సర్కార్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో విద్యాశాఖ మంత్రి ఏ విధంగానైతే రాజీనామా చేశారో, తెలంగాణలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మహేష్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫల మైందని, ప్రజలను నిలువునా ముంచిందని మహేష్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని, వారి భవిష్యత్తుతో ఆడుకుంటోందని ఆరోపించారు. ప్రస్తుత తరం ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను గమనిస్తోందని, త్వరలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కూడా జెన్-జెడ్ తిరుగుబాటు రుచి చూపిస్తుందని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, పాలనను గాలికొదేసి కేవలం రాజకీయ పబ్బం గడుపుకుంటోందని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డికి గద్దె దిగే రోజులు దగ్గరపడ్డాయి. కేంద్రంలో జెన్-జెడ్ దెబ్బకు ఏ విధంగానైతే విద్యాశాఖ మంత్రి దిగొచ్చారో, తెలంగాణలోనూ కాంగ్రెస్ ప్రభుత్వానికి అదే గతి పడుతుందని మహేష్ రెడ్డి తెలిపారు.

**- ఢిల్లీలో రాజీనామా చేస్తే.. పరిగిలో హామీలు అమలు చేస్తారా..**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, పరిగి ఎమ్మెల్యే వ్యవహారశైలిపై మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ పరిణామాలను తిప్పిచెబుతూ స్థానిక పరిగి ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయగానే... ' తెలంగాణ తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం' అని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించడం అత్యంత సిగ్గుచేటు" అని మహేష్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, స్థానిక హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఇలాంటి ప్రకటనలు చేస్తూ ప్రజలను మళ్లీ మోసం చేయడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. స్థానిక సమస్యలను గాలి కొదేసి, ఇతర ప్రాంతాల పరిణామాలను చూపుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న పరిగి ఎమ్మెల్యే తీరుపై ప్రజలే అసహ్యిం చుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక హామీలను మరిచిపోయిన కాంగ్రెస్ నేతలు... ఇప్పుడు ఢిల్లీ ఘటనల సాకుతో ప్రకటనలు చేయడం హాస్యాస్పదం. రేవంత్ రెడ్డితో సహా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులందరినీ ప్రజలు గద్దె దించే రోజులు దగ్గరపడ్డాయని మహేష్ రెడ్డి ఏద్దేవా చేశారు.

## విద్యార్థుల పోరాటఫలితమే కేంద్ర మంత్రి రాజీనామా..

- సిపిఎం, ఎస్ఎఫ్ఐ, నాయకుల సంబరాలు




**పరిగి, జూలై 26 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ, విద్యా రంగంలో పేరుకుపోయిన అవినీతిపై దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన సుదీర్ఘ పోరాటాలకు కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం విద్యార్థుల చారిత్రాత్మక విజయమని సిపిఎం, ఎస్ఎఫ్ఐ, నాయకులు స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి రాజీనామాను స్వాగతిస్తూ శనివారం పరిగి బస్ స్టాండ్ ఆవరణలో సిపిఎం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున టపాసులు పేల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. విద్యను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రల వల్లే ఈరోజు నీట్ లీకేజీ వంటి అతిపెద్ద కుంభకోణాలు వెలుగుచూ యన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిన కేంద్ర ప్రభుత్వ విధానాలపై దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక శక్తులు తిరగబడ్డాయి. ప్రజా పోరాటాల శక్తి ముందు ఏ ప్రభుత్వమైనా తలవంచక తప్పదని ఈ రాజీనామా నిరూపించిందన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా ఆందోళన చేపట్టిన ప్రముఖ సామాజిక కార్యకర్త సోనాం వాంగ్‌చుక్‌ను బలవంతంగా అరెస్ట్ చేసి ఆసుపత్రికి తరలించడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే అణచివేత చర్యలను కేంద్రం వెంటనే విరమించుకో వాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ కుట్రపై సుప్రీంకోర్టు పరిధిలో పూర్తి స్థాయి న్యాయ విచారణ జరిపి, బాధ్యులైన ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలని, బాధితులైన విద్యార్థులకు తక్షణమే న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్యయ్య, నర్సింహా, నరేందర్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఖలీమ్, రోహిత్, ప్రేమ్, చరణ్‌లతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి రూ. 5 లక్షల నిధుల మంజూరు

- కొండ విశ్వేశ్వర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయ బృందం




**పరిగి, జూలై 26 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** స్థానిక సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి తమ ఎంపీ ల్యాడ్స్ నిధుల నుండి రూ. 5,00,000 మంజూరు చేశారు. ఈ నిధులను పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ఉపయోగించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, స్థానిక నాయకులు మాట్లాడుతూ..విద్యారంగ అభివృద్ధికి, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయం. ఎంపీ నిధులతో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరలోనే పూర్తవుతుంది. దీనివల్ల విద్యార్థులకు మరింత మెరుగైన ప్రశాంతమైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందన్నారు. పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించిన ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, పరిగి పట్టణ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సంఘటన మంత్రి పతకమురి శ్రీనివాస్, ప్రాంత విద్యుత్ పరిషత్ కన్వీనర్ అర్థచంద్రప్రకాష్ రెడ్డి, పాఠశాల అధ్యక్షుడు రాచూరి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చెట్టుకింద సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి వెంకట్ రాములు, సైక్షనిక్ ప్రముఖ్ వెంకట్రాం రెడ్డి, పాఠశాల ప్రధానాచార్య కే. మల్లేష్, బీజేపీ రాష్ట్ర నాయకుడు మిట్ట పరమేశ్వర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుండెపల్లి బాలకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు వేముల పెంటయ్య గుప్తా, కేశవులు, తిరుపతి రెడ్డి, వెంకటయ్య, పూడూరు మండల అధ్యక్షుడు రాఘవేందర్, దోమ మండల అధ్యక్షుడు మల్లేష్, పరిగి మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, చౌడాపూర్ మండల మాజీ అధ్యక్షుడు బందెయ్య, పరిగి పట్టణ జనరల్ సెక్రెటరీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- బడుల్లో ప్రత్యేక 'రెమిడియేషన్' కార్యక్రమం
- పరిగి మండల విద్యాధికారి అంజయ్య




**పరిగి, జూలై 26 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** మౌలిక భాషా, గణిత సామర్థ్యాల నైపుణ్యాలను సాధించడంలో వెనుకబడి ఉన్న విద్యార్థులను ఆదుకోవడానికి ప్రతిరోజూ ప్రత్యేకంగా సమయం కేటాయించి 'రెమిడీయేషన్' కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించిన పరిగి మండల విద్యాధికారి అంజయ్య, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సౌజన్యంతో ఇంటిగ్రేటెడ్ ఇన్ - సర్వీస్ టీచర్ల కొరకు జడ్పీహెచ్ఎస్ నెంబర్-1 పాఠశాలలో నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని రెండు స్పెల్స్‌గా నిర్వహించగా, మొదటి స్పెల్ సోమవారం నుండి బుధవారం వరకు, రెండో స్పెల్ గురువారం నుండి శనివారం వరకు కొనసాగింది. మండల పరిధిలోని 50 శాతం మంది ఉపాధ్యాయులు మొదటి స్పెల్‌లో, మిగిలిన 50 శాతం మంది రెండో స్పెల్‌లో పాల్గొని శిక్షణ పొందారు.?ముగింపు సమావేశానికి కోర్సు డైరెక్టర్, ఎంఈఓ, అంజయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యా ప్రగతి, వారు ఉన్నత స్థాయికి చేరుకోవడం అనేది సంపూర్ణంగా ఉపాధ్యాయుల బాధ్యతపైనే ఆధారపడి ఉంటుంది. తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించడం చాలా ముఖ్యమన్నారు. 80 శాతం కంటే ఎక్కువ సామర్థ్యాలు సాధించిన విద్యార్థులను ఒక గ్రూప్‌గా ఏర్పరచాలి. 80 శాతం కంటే తక్కువ సామర్థ్యాలు ఉన్న విద్యార్థులను 'టీచర్ సపోర్ట్ గ్రూప్'గా విభజించాలి. ?ఈ విద్యార్థుల కోసం ప్రతిరోజూ మధ్యాహ్నం 3:00 గంటల నుండి 4:00 గంటల వరకు ప్రత్యేకంగా సమయం కేటాయించి, బోధన అందిస్తూ వారిని చదువులో ముందుకు నడిపించాలి. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ఎం.డి. ఉస్మాన్ అలీ, ఎం. రాజేష్, వెంకట ప్రసాద్, నరేందర్ లతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు చంద్రశేఖర్, శ్రీనివాస్, ఎమ్మార్సీ సిబ్బంది మోహన్ బాబు, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల సమగ్ర సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి..




- పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి

**పరిగి, జూలై 26 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** ఓటర్ల సమగ్ర పరిశీలన (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం పరిగి పట్టణంలోని 214, 215 సంఖ్య గల పోలింగ్ కేంద్రాల పరిధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులతో (బి.ఎల్.ఓ) మాట్లాడుతూ... సర్వే నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరగకుండా చూడాలని తెలిపారు. ?అనంతరం ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ... ఆగస్టు 3వ తేదీ వరకు వేచి చూడకుండా ఓటర్లు వెంటనే తమ వివరాల నమోదు ఫారాలను నింపి సంబంధిత అధికారులకు అందజేయాలని కోరారు. చివరి నిమిషంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తుగానే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ?ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 13వ వార్డు ఇన్చార్జి అన్వర్, మైనార్టీ విభాగ అధ్యక్షులు మాజీద్, బూత్ స్థాయి ఏజెంట్ అఫ్రోజ్, బూత్ స్థాయి అధికారులు నుస్రత్, నర్సమ్మలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు.. విద్యార్థులకు అన్నదానం, పండ్ల పంపిణీ



**పరిగి, జూలై 26 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు (కేటీఆర్) జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆదేశాల మేరకు, హైదరాబాద్ నగరంలోని మలక్పేట్ అనాథ ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానం పండ్ల పంపిణీ చేసిన వికారాబాద్ జిల్లా పరిగి మండలం తొండపల్లి గ్రామానికి చెందిన చాకలి రాకేష్, ఈ సందర్భంగా రాకేష్ మాట్లా డుతూ..తెలంగాణ రాష్ట్ర రూపురేఖలు మార్చిన యువ నాయకుడు, మన ప్రియతమ నాయకులు కేటీఆర్ జన్మదినాన్ని పురస్క రించుకొని, మన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మార్గదర్శకత్వంలో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ?కేటీఆర్ మరెన్నో ఏళ్లు ఆయుం ారోగ్యాలతో, సంతోషంగా జీవించాలని, ప్రజాసేవలో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భగవంతు డిని ప్రార్థిస్తున్నని రాకేష్ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి నాయకత్వంలో పరిగి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి, ప్రజల సంక్షేమానికి మేము ఎల్లప్పుడూ ముందుంటా మన్నారు.? ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆగస్టు 2, 3 తేదీల్లో మైసమ్మ, పోచమ్మ బోనాలు..



- పెద్దలు, ఆలయ కమిటీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

**పరిగి, జూలై 26 ( తెలంగాణ డైలి న్యూస్ ) :** పరిగి పట్టణంలో ప్రతి సంవత్సరం ఎంతో వైభవంగా నిర్వహించే మైసమ్మ, పోచమ్మ బోనాల ఉత్సవాలకు సంబంధించి ఈరోజు బహర్పేట్ పోచమ్మ దేవాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిగి పట్టణ పుర ప్రముఖులు, కుల సంఘాల ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. అందరి సూచనలు, సలహాల మేరకు ఈ సంవత్సరం ఆగస్టు 2, 3వ తేదీలలో మైసమ్మ, పోచమ్మ బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఏకాభిప్రాయంతో తీర్మానించారు. అలాగే, రాబోయే జనవరి నెలలో మైసమ్మ పండుగను కూడా ఘనంగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ?ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన పట్టణ పెద్దలు మరియు స్థానిక నాయకులు మాట్లాడుతూ... పండుగకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో, కులమతాలకు అతీతంగా ఊరంతా కలిసికట్టుగా ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు, పరిగి పట్టణ పెద్దలు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు యవకులు పాల్గొని పండుగను విజయవంతం చేయడానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమం ఈ కార్యక్రమంలో పరిగి పట్టణ ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు

